నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, శుక్రవారం 25 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘన స్వాగతం

## సారపాక ఐటీసీ అతిథి గృహంలో రాత్రి బస


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్, పక్కన ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు

బూర్గంపహాడ్, అక్టోబర్ 24 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం సాయంత్రం సారపాకలోని ఐటీసీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం ఆలయ ఈవో రమాదేవిలు వేర్వేరుగా పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అర్చకులు గవర్నర్‌ను ప్రత్యేక పూజలతో స్వాగతించారు. రాత్రి ఐటీసీలోని అతిథి గృహంలో ఆయన బస చేశారు. శుక్రవారం ఉదయం భద్రాచలం సీతారామచంద్రస్వామిని గవర్నర్ దర్శించుకొని పూజలు చేయనున్నారు. కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్, సీఐ వినయ్‌కుమార్, తహసీల్దార్ ముజాహిద్, ఎస్సై రాజేశ్ పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు నేడు దీపావళి బోనస్

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 24: దీపావళి బోనస్‌గా పిలిచే ప్రొడక్షన్ లింక్డ్ రివార్డు స్కీం (పీఎల్ఆర్ఎస్)ను శుక్రవారం సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం సచివాలయంలో ప్రకటించారు. దీని కోసం సింగరేణి సంస్థ నుంచి రూ.358 కోట్లు విడుదల చేయాలని సీఎండీ బలరాంను ఆదేశించారు. నిరుడు చెల్లించిన దీపావళి బోనస్ కంటే ఈసారి రూ.50 కోట్లు అధికమని చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు దీపావళి బోనస్‌ను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని భట్టి కోరారు. కాగా, ఒక్కో కార్మికుడి రూ.93,750 చొప్పున అందుకోనున్నారు. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40 వేల మంది కార్మికులకు ఇది వర్తిస్తుంది.

### రూ.358 కోట్లు విడుదల చేయాలి: భట్టి


సచివాలయంలో సీఎండీతో మాట్లాడుతున్న భట్టి

# లాభాల బాటలో 'డెయిరీ' నడిపించాలి

- ప్రతి అంశాన్ని వ్యాపార దృష్టితో చూడాలి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


మహిళా రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఎర్రుపాలెం, అక్టోబర్ 24 : పాల వ్యాపారాన్ని విస్తృతం చేస్తూ ఇందిరా మహిళా డెయిరీని లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరా మహిళా డెయిరీని గురువారం సందర్శించిన కలెక్టర్.. పాల వ్యాపారం, రోజువారీ అమ్మకాల గురించి మహిళా రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డెయిరీ నిర్వహణలో ప్రతి అంశాన్ని వ్యాపార దృష్టితో చూడాలని, మంచి లాభాలు వస్తేనే స్వయం సహాయక సంఘాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సంఘ సభ్యులకు ఆదాయం పెంచాలనే ఆలోచనతో సమన్వయంతో పనిచేయాలన్నారు. స్వయం సంఘాల పరిధిలోని పాడి రైతులకు వచ్చే వారం పాల వ్యాపారం, కొవ్వు శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో శిక్షణ ఇస్తామన్నారు. విజయవంతంగా వ్యాపారం చేస్తున్న మహిళా సంఘాల అనుభవాలను తెలియజేయాలన్నారు. పాల వ్యాపారంతో ప్రతి మహిళ నెలకు దాదాపు రూ.15 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా సమాఖ్య నుంచి కొందరు సభ్యులను, పాడి రైతులను ఎంపిక చేసి త్వరలోనే గుజరాత్ అమూల్ డెయిరీ పరిశీలనకు పంపిస్తామన్నారు. అక్కడ వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించి ఇక్కడ అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి కింద ఏర్పాటు చేసుకున్న వివిధ వ్యాపార యూనిట్ల స్థితిగతుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించామని, ఇంగ్లిష్ మీడియంలో కూడా బోధన జరుగుతున్నదని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కలెక్టర్ మహిళలను కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, తహసీల్దార్ ఉషాశారద, ఇందిరా మహిళా డెయిరీ మేనేజర్ సిద్దేశ్వర్, ఏపీఎం కే.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రవీందర్, డీపీఎం డీ.శ్రీనివాస్, ఏపీఎం కే.వెంకటేశ్వర్లు, డెయిరీ పీఎం జే.లక్ష్మణరావు, ఇందిరా డెయిరీ అధ్యక్షురాలు కే.అన్నపూర్ణలలిత, రమణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జే.అనిత తదితరులు పాల్గొన్నారు.

# నానాటికీ తీసికట్టు..

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏటికేడు గణనీయంగా పడిపోతున్న ప్రవేశాలు
- జిల్లాలోని 21 కాలేజీల్లో కేవలం మూడింటిలోనే 200కు మించి విద్యార్థులు
- కళాశాలలు పెరుగుతున్నా.. అడ్మిషన్ల పెంపుపై దృష్టి సారించని రాష్ట్ర ప్రభుత్వం
- 20 వేలకుపైగా సీట్లకు అవకాశం ఉన్నప్పటికీ కేవలం 2,923గానే ప్రవేశాలు
- జిల్లా కాలేజీల్లో 15కి మించని ప్రవేశాల శాతం.. 30కి మించని హాజరు శాతం

ఖమ్మం, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు కళకళలాడుతుండగా.. ప్రభుత్వ కాలేజీలు మాత్రం వెలవెలబోతున్నాయి. ప్రైవేట్‌లో చేరే విద్యార్థుల సంఖ్య నానాటికీ పెరుగుతుండగా.. ప్రభుత్వ కాలేజీల్లో చేరే వారి సంఖ్య ఏటికేడు తీసికట్టుగా మారుతోంది. ప్రభుత్వ కళాశాలల్లో 150 నుంచి 200కు మించి ప్రవేశాలు ఉండట్లేదు. విద్యార్థుల ప్రవేశాలు ఇంత గణనీయంగా తగ్గిపోతున్నా ప్రభుత్వం మాత్రం దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదు. కళాశాలలు పెరుగుతున్నప్పటికీ అడ్మిషన్లు పెరగకపోవడం ఆందోళన కలిగిస్తున్న అంశం.

### ప్రశ్నార్థకంగా మనుగడ..

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చేరే పిల్లల సంఖ్య అత్యధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుంటే.. వీటిల్లో నాలుగింటిలో 50 మందిలోపు, తొమ్మిదింటిలో 100 మందిలోపు విద్యార్థులు ఉన్నారు. 200 మందికిపైగా విద్యార్థులున్న కళాశాలలు మూడంటే మూడే. అవి కూడా జిల్లా కేంద్రంలోనే. అత్యధికంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 6 ఒకేషనల్ కోర్సులు, 4 జనరల్ కోర్సులు ఉన్నాయి. తర్వాత నయాబజార్ కళాశాలలో ఒకేషనల్‌లో 5 కోర్సులు, జనరల్‌లో 4 కోర్సులు, ఏఎస్ఆర్ కళాశాలలో ఒకేషనల్‌లో 3 కోర్సులు, జనరల్‌లో 4 కోర్సులు ఉన్నాయి.


ఖమ్మంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

### కనీసం వెయ్యి మందికి అవకాశం

జిల్లాలో ఈ విద్యాసంవత్సరంలో 21 కళాశాలలు ఉన్నాయి. అన్నింట్లోనూ ఆర్ట్స్, సైన్స్ గ్రూపులున్నాయి. ఒక్కో గ్రూపులో గరిష్ఠంగా 88 మంది విద్యార్థులను చేర్చుకొనే అవకాశముంది. హెచ్ఈసీ, సీఈసీ, బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో సగటున ప్రతి కళాశాలలో కనిష్ఠంగా 350 మంది విద్యార్థులకు చదువు చెప్పాలన్నది ఇంటర్ విద్యా మండలి లక్ష్యం. కానీ.. జిల్లాలో రెండు మినహా 19 కళాశాలలు ఈ లక్ష్యానికి దూరమే. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ప్రతి కళాశాలలో జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో కలిపి 1,000 మంది చొప్పున 21 కళాశాలల్లో సుమారు 20 వేల మంది ప్రవేశం పొందాల్సి ఉంది. కానీ.. ఇందులో 15 శాతం అంటే 3 వేలలోపే సీట్లు భర్తీ అవుతున్నాయి.

| విద్యాసంవత్సరం | జనరల్ | ఒకేషనల్ | మొత్తం |
|---|---|---|---|
| 2022-23 | 2,051 | 1,147 | 3,198 |
| 2023-24 | 1,956 | 1,118 | 3,074 |
| 2024-25 | 1,844 | 1,079 | 2,923 |

### అడ్మిషన్లు ఇలా..

నిరుడు సత్తుపల్లిలో ఒకటి, ఈ ఏడాది కూసుమంచిలో ఒకటి చొప్పున కొత్త కళాశాలలు వచ్చాయి. గతంలో 19 కళాశాలలు ఉండగా.. వీటితో కలుపుకొని ఇప్పుడు 21 అయ్యాయి. వీటిల్లో జనరల్, ఒకేషనల్ కలిపి 2024-25 ప్రథమ సంవత్సరంలో మొత్తం 2,923 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. కళాశాలల వారీగా విద్యార్థుల సంఖ్య ఇలా ఉంది. ఏఎస్ఆర్ కళాశాలలో-401 మంది, నయాబజార్‌లో-278, బాలికల జూనియర్ కళాశాల-503, సత్తుపల్లి బాలికల కళాశాల-131, సత్తుపల్లి కళాశాల-151, మధిర కళాశాల-130, మధిర సిరిపురం కళాశాల-36, వైరా కళాశాల-92, కల్లూరు కళాశాల-101, ఏన్కూరు కళాశాల-87, పిండిప్రోలు కళాశాల-151, బనిగండ్లపాడు కళాశాల (ఎర్రుపాలెం)-68, నేలకొండపల్లి కళాశాల-150, నాగులవంచ-84, కామేపల్లి కళాశాల-35, కారేపల్లి కళాశాల-148, ముదిగొండ కళాశాల-117, బోనకల్లు కళాశాల-97, పెనుబల్లి కళాశాల-101, కందుకూరు కళాశాల (వేంసూరు)-13, కూసుమంచి కళాశాల-49 మంది విద్యార్థులు ఉన్నారు.

### హాజరు శాతమూ అంతంతే..

ప్రవేశాలు పొందిన విద్యార్థులు కూడా కళాశాలకు రెగ్యులర్‌గా హాజరు కావడం లేదు. రోజువారీ హాజరు శాతమూ అంతంత మాత్రమే. చాలామంది విద్యార్థులు ఫస్టియర్‌లో అడ్మిషన్ పొంది.. తరువాత మానేస్తున్నారు. కొన్నిచోట్ల అడ్మిషన్లు చూపించేందుకే టెన్త్ పూర్తయిన విద్యార్థులను తీసుకొచ్చి అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. తరువాత ఫీజులు చెల్లించకుండా వదిలేస్తున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులు ఆయా సబ్జెక్టుల్లో బోధించాలంటే తగినంతమంది విద్యార్థులుండాలి. అప్పుడే వారు రెన్యూవల్ అవుతారు. దీంతో అధ్యాపకులు.. కొందరు విద్యార్థులనైనా చేర్పించే పనిలో ఉంటున్నారు. జిల్లా కేంద్రంలో హాస్టల్లో ఉంటూ వచ్చే విద్యార్థుల హాజరు శాతం కొంత మెరుగ్గా ఉంటున్నప్పటికీ మండల కేంద్రాల్లోని 30 నుంచి 40 శాతం కూడా హాజరు ఉండట్లేదు. అధ్యాపకులు తాము పనిచేసే ప్రాంతాల్లో అడ్మిషన్ల సమయంలో మొక్కుబడిగానే విద్యార్థులను కలుస్తున్నారు.

### సమావేశాలు నిర్వహించాం..



జూన్ నుంచి అక్టోబర్ వరకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించేందుకు పలుమార్లు గడువు పొడిగించాం. ప్రతిసారీ ప్రిన్సిపాళ్లతో సమావేశాలు నిర్వహించి అడ్మిషన్ల పెంపునకు కృషి చేయాలని సూచించాం. అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు గ్రామాల్లో తిరిగి అడ్మిషన్లు చేయించే ప్రయత్నం చేశారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రవేశాలు పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తాం.

–కే.రవిబాబు, డీఐఈవో, ఖమ్మం

# 'షరతుల'తో 'సర్వే'లోకి..

- అగ్రికల్చర్ డైరెక్టర్‌తో చర్చల అనంతరం ఏఈవోల అంగీకారం
- 4 ప్రధాన డిమాండ్లకు వ్యవసాయ సంచాలకుడు సానుకూలం
- 3 రోజులు డీసీఎస్ సర్వే.. తరువాత మంత్రి, పీఎస్‌లతో చర్చలు..
- ఇది సమ్మె విరమణ కాదు.. తాత్కాలిక వాయిదానే : ఏఈవోలు


రఘునాథపాలెంలో డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్న ఏఈవో

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 24: అనేక షరతులు, నిబంధనల తరువాత వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు (ఏఈవోలు) ఎట్టకేలకు డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్)కు అంగీకరించారు. ఏఈవోల సంఘం బాధ్యులు, అడ్‌హక్ కమిటీ సభ్యులు కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్‌తో బుధవారం చర్చలు జరిపిన విషయం విదితమే. ఏఈవోల నాలుగు ప్రధాన డిమాండ్లను ఆ శాఖ సంచాలకుడు అంగీకరించడంతో తిరిగి డిజిటల్ క్రాప్ సర్వేను మూడు రోజులపాటు చేపట్టాలని ఏఈవోల సంఘం నేతలు నిర్ణయించారు. సస్పెండెడ్ ఏఈవోలను తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఈ నెల వేతనాలు యథావిధిగా జమ చేయాలని, మూడు రోజుల సర్వే అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావులు అడ్‌హక్ కమిటీతో చర్చలు జరపాలని, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల నియామకం గురించి ప్రభుత్వంతో చర్చించాలని ఏఈవోల సంఘం నేతలు డిమాండ్లు పెట్టారు. ఈ నాలుగు ప్రధాన డిమాండ్లకు రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు అంగీకరించారు. దీంతో ఎట్టకేలకు ఏఈవోలు డీసీఎస్ యాప్‌ను తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకున్నారు. శనివారం వరకు సర్వే కొనసాగించిన తరువాత మరోసారి చర్చలకు వెళ్లాల్సి ఉంటుందని వారు తెలిపారు. ఇది సమ్మె విరమణ కాదని, తాత్కాలిక వాయిదా మాత్రమేనని స్పష్టం చేశారు. సోమవారం చర్చల అనంతరం మరోసారి తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

# సస్పెన్షన్లతో ఏఈవోలకు బెదిరింపులు?

## వాటిని ఎత్తివేయాలంటే విధుల్లో చేరాలంటూ అల్టిమేటం?


యాప్ ద్వారా డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే చేస్తున్న ఏఈవో

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : డిజిటల్ క్రాప్ సర్వే చేయాల్సిందేనన్న ప్రభుత్వ ఒత్తిడిని అంగీకరించకుండా నెల రోజుల పాటు ఆ విధులకు దూరంగా ఉన్న భద్రాద్రి జిల్లాలోని 67 మంది ఏఈవోలు.. బుధవారం నాటి చర్చల అనంతరం మూడు రోజుల సర్వేకు సిద్ధమయ్యారు. ప్రాథమిక చర్చల్లో హామీ ఇచ్చినట్లుగా సోమవారం నాటికి తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాకపోతే మళ్లీ సమ్మెలోకి వెళ్తామంటూ వారు తేల్చిచెబుతున్నారు. అయితే, ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వ అల్టిమేటం వల్లనే ఏఈవోలు మెట్టు దిగినట్లు తెలుస్తోంది. సస్పెన్షన్లు ఎత్తి వేయాలంటే ముందుగా విధుల్లో చేరి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేయడంతోనే ఆ చిరు ఉద్యోగులు యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకొని సర్వేలో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. అయితే, తమను బెదిరించి పనులు చేయిస్తున్నారా? లేక చర్చలు జరిపి తమ సమస్యలను కొలిక్కి తెస్తారా?' అనే అంశం ఆ ఉద్యోగుల్లో గుబులు పుట్టిస్తోంది. ఉన్నతాధికారులు చెప్పినట్లుగా మూడు రోజుల తర్వాత చర్చలు జరుపుతారా? లేక.. బెదిరింపులతోనే పనులు చేయించుకుంటారా? అనేది వేచి చూడాలి.

### చర్చలతో పరిష్కరిస్తామన్నారు..



నెల రోజుల నుంచి మా సమస్య పరిష్కారం కాలేదు. యాప్ ద్వారా పంటల బుకింగ్ చేయడం చాలా కష్టమైన పని. ప్రస్తుతానికి యాప్ తీసుకుని సర్వే చేయమని కమిషనర్ చెప్పారు. సోమవారం చర్చలు జరిపి మాట్లాడుతామన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే సమ్మె చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

–నరసింహ, ఏఈవోల సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

# చింతకాని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి అక్రమ అరెస్ట్

- భర్తను ఇంట్లోంచి తీసుకెళ్తుండగా ఛాతి నొప్పితో పడిపోయిన పుల్లయ్య భార్య
- ప్రొద్దుటూరులో పోలీసుల వాహనాన్ని అడ్డుకున్న కుటుంబ సభ్యులు, మహిళలు
- అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ మధిర రూరల్ ఠాణా ఎదుట జడ్పీ మాజీ చైర్మన్ ఆందోళన
- ఉగ్రవాదిలా పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతారా : ప్రశ్నించిన జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు


అరెస్టుకు కారణం చెప్పాలంటూ కారు ముందు బైఠాయించిన కుటుంబ సభ్యులు, మహిళలు

మధిర/మధిర రూరల్/చింతకాని, అక్టోబర్ 24 : ఖమ్మం జిల్లా చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి గురువారం ఆందోళనకు దిగారు. మఫ్టీలో ఉన్న వైరా సర్కిల్ పోలీసులు సుమారు ఐదు కార్లలో వచ్చి అయ్యప్ప మాల ధరించిన పుల్లయ్యను చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలోని ఆయన ఇంట్లో నుంచి ఎత్తుకొచ్చి తమ వాహనంలో ఎక్కించారు. దీంతో అవాక్కైన ఆయన కుటుంబ సభ్యులు బైఠాయించి పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేయగా.. మహిళలు అని చూడకుండా మఫ్టీలో ఉన్న పోలీసులు వారిని నెట్టి వేశారు. దీంతో పుల్లయ్య ఇంటి వద్ద కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే వైరా సీఐ నూనావత్ సాగర్, చింతకాని, వైరా ఎస్సైలు, టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో పుల్లయ్యను సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతూ చివరికి మధిరకు తీసుకొచ్చారు. దీంతో మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌కు పుల్లయ్యను తరలించిన విషయాన్ని తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు.. పార్టీ నాయకులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టడంతో పాటు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పుల్లయ్యను ఎందుకు అరెస్టు చేశారని, మీరు పోలీసులా.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా.. అంటూ ప్రశ్నించారు. శాంతిభద్రతలను పక్కన పెట్టి ప్రతిపక్ష నాయకులనే లక్ష్యంగా చేసుకొని అరెస్టులు చేయడం సరికాదన్నారు. మధిర నియోజకవర్గంలో ఇలాంటి నీచ రాజకీయాలు ఎప్పుడూ చూడలేదని, సివిల్ డ్రెస్‌లో వచ్చిన పోలీసులు పెంట్యాల పుల్లయ్యను ఏ కేసులో అరెస్టు చేశారో చెప్పాలని, బేషరతుగా ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కమల్‌రాజు వెంట మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### ఛాతి నొప్పికి గురైన పుల్లయ్య భార్య

తన భర్తను అకారణంగా అరెస్ట్ చేసి తీసుకెళ్లడంతో ఆందోళనకు గురైన ఆయన భార్య పెంట్యాల భారతమ్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో వెంటనే 108 వాహనంలో ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. 70 ఏళ్ల వయసు ఉన్న తమ తండ్రి పెంట్యాల పుల్లయ్యను పోలీసులు ఈడ్చుకెళ్తున్నారన్న బాధతో పోలీసులను అడ్డకునే ప్రయత్నం చేయగా.. మహిళలు అని చూడకుండా మఫ్టీలో ఉన్న పోలీసులు తమను నెట్టివేశారని పుల్లయ్య కుమార్తెలు ఆరోపించారు. తమ తండ్రిని ఎందుకు తీసుకెళ్తున్నారని పలుమార్లు అడిగినా సమాధానమివ్వలేదన్నారు.

### ఉగ్రవాదిలా తిప్పుతారా : కమల్‌రాజు

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను ఉగ్రవాదిలా పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతారా.. అని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు మండిపడ్డారు. మధిరలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతకాని మండలం లచ్చగూడెంలో విద్యుత్ షాక్‌తో ఓ రైతు మరణిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచిన పుల్లయ్యను అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో పోలీసు అధికారుల చేత అక్రమ అరెస్టులు చేయించడం సరికాదన్నారు. పుల్లయ్య నేరం చేసి ఉంటే నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి అరెస్టు చేయాలే తప్ప అయ్యప్ప మాలలో ఉండి భిక్ష చేస్తున్న ఆయనను బయటకు లాక్కొచ్చి అరెస్ట్ చేయడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. గత కేసీఆర్ పదేళ్ల పాలనతో పోలీసులు ఉద్యోగ బాధ్యతలు ఇలాగే నిర్వర్తించారా.. అని ప్రశ్నించారు.

వాస్తవాలు పరిశీలించి తప్పు చేసిన వారికి శిక్ష పడేలా వ్యవహరించాలే తప్ప అక్రమ కేసులు బనాయించే విధంగా వ్యవహరించొద్దన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, చావా వేణు, బొగ్గుల వీరారెడ్డి, ఖురేష్, నాగబాబు, అబ్బూరి రామన్, శీలం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


ప్రొద్దుటూరులో బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను ఇంట్లో నుంచి లాక్కెళ్తున్న వైరా సర్కిల్ పోలీసులు


జిల్లా కోర్టు వద్ద ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

### అక్రమ అరెస్టును ఖండించిన ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, అక్టోబర్ 24: చింతకాని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అక్రమ అరెస్టును ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్ తీవ్రంగా ఖండించారు. దీనిని రాజకీయ ప్రేరేపిత చర్యగా తాము భావిస్తున్నామని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఒత్తిడులు, బెదిరింపులతో లొంగదీసుకోలేరని ఆయన పేర్కొన్నారు. అయ్యప్ప మాల ధరించిన వ్యక్తిని పోలీసులు టెర్రరిస్టు మాదిరిగా అరెస్టు చేసి తీసుకెళ్లడం హిందూ సంప్రదాయాలు, విశ్వాసాలపై దాడిగా భావిస్తున్నామని తెలిపారు. పుల్లయ్య అరెస్టు సందర్భంగా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వైరా పోలీసులపై చట్టపరంగా చర్య తీసుకోవాలని, పుల్లయ్యను బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### జిల్లా జైలుకు పెంట్యాల పుల్లయ్య తరలింపు

#### 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు

ఖమ్మం లీగల్, అక్టోబర్ 24: ఖమ్మం జిల్లా చింతకాని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఖమ్మం మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన గూని ప్రసాద్ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఇటీవల విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. దీంతో అతడి శవాన్ని తీసుకొని కొదుమూరు విద్యుత్ సబ్ స్టేషన్‌కు బయలుదేరగా.. వెంట వెళ్తున్న నరేశ్, పెంట్యాల పుల్లయ్య తదితరులను పోలీసులు అడ్డుకొని ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తుతుందని చెప్పారు. అయితే విధులకు ఆటంకం కలిగించడంతోపాటు తమను చంపడానికి యత్నించారని మొదటి నిందితుడు నరేశ్, పదవ నిందితుడైన పెంట్యాల పుల్లయ్యతోపాటు మరికొందరిపై పోలీసులు కేసు పెట్టారు. దీంతో గురువారం అరెస్ట్ చేసి ఖమ్మం మూడవ అదనపు కోర్టుకు తరలించగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా జిల్లా జైలుకు తరలించారు. కాగా.. ఖమ్మం కోర్టుకు సాయంత్రం ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, నాయకులు పగడాల నాగరాజు, న్యాయవాదులు బిచ్చాల తిరుమలరావు, కొత్త వెంకటేశ్వరరావు, తాళ్లూరి దిలీప్, మద్రి ప్రకాశ్, పసుపులేటి శ్రీనివాసరావు, నిరోషా, పి.రామ్మూర్తి తదితరులు తరలివచ్చారు. బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని వారు ఆరోపించారు.